క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న మరమ్మతుల వల్ల శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీ డీసీఎల్ ఈఈ ఏవీఎస్‌డీఎస్ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రాంతంతో పాటు నవర, పవర, గొంచాల, ఉండూరు గ్రామాల్లోను విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు అసౌకర్యానికి సహకరించాలని కోరారు.

నేడు కొమరగిరిలో జగనన్న ఆరోగ్య సురక్ష

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరి గ్రామ సచివాలయం-2 వద్ద శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటనారాయణ గురువారం తెలిపారు. కొమరగిరి పీహెచ్‌సీ వైద్యాధికారులు రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. గ్రామ ప్రజలు ఈ సురక్ష శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



పిఠాపురంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జేసీ ప్రవీణ్ ఆదిత్య

పిఠాపురం: వచ్చే ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును ఇబ్బంది లేకుండా వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని జేసీ ప్రవీణ్ ఆదిత్య అధికారులకు సూచించారు. పిఠాపురంలోని ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్, ఓబీసీ పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పోలింగ్ కేంద్రాల ఎంపిక పూర్తయినందున వెంటనే ఆయా పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల ఏర్పాటుపై దృష్టి సారించామన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా ఓటర్లను చైతన్య పరిచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సిలర్ లలితకు నివాళి



నక్కా లలిత చిత్ర పటం వద్ద నివాళులు అర్పించిన దవులూరి దొరబాబు తదితరులు

సామర్లకోట: స్థానిక 26వ వార్డు కౌన్సిలర్ నక్కా లలితకు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు గురువారం నివాళులు అర్పించారు. ఇటీవల అనారోగ్యంతో బాధ పడుతూ లలిత మృతి చెందిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, వైస్‌చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, పలువురు కౌన్సిలర్లు పాల్గొని సంతాపం తెలిపారు.

ముగిసిన రహదారి భద్రతా వారోత్సవాలు



డ్రైవర్లను సత్కరిస్తున్న అధికారులు





కాకినాడ సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన రహదారి భద్రతా మాసోత్సవాలు ముగింపు కార్యక్రమం గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ ఎంయూపీ మనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు, జిల్లా ప్రాంతీయ రవాణా అధికారి పీవీ సాయి ప్రసాద్, కాకినాడ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్‌రెడ్డి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ షణ్ముఖ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. రోడ్డు భద్రతా నియమాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జిల్లా పరిధిలో ముగ్గురు డ్రైవర్లకు, డిపో పరిధిలో 9 మంది ప్రమాద రహితంగా వాహనాలు నడిపిన డ్రైవర్లకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. తుని డిపో మేనేజర్ ఎస్.కిరణ్ కుమార్, ఏలేశ్వరం డిపో మేనేజర్ జీవీవీ సత్యనారాయణ, ఆర్‌ఎం కార్యాలయం అసిస్టెంట్ మేనేజర్ ఎస్‌కేఎం బాషా, కాకినాడ, తుని డిపోల అసిస్టెంట్ మేనేజర్లు టి.బాలకృష్ణ, జీజీ రమణ, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రత్నగిరిపై నేడు రథసప్తమి వేడుకలు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో శుక్రవారం రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు గురువారం తెలిపారు. సత్యదేవుని వార్షిక కల్యాణ వేదికపై ఉదయం 8.30 గంటలకు సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు, వివిధ భంగిమల్లో నమస్కారాలు నిర్వహిస్తామని చెప్పారు.

రథసప్తమి వేడుకలకు రెడీ



అమరగిరి మెట్టపై రథసప్తమి వేడుకలకు సిద్ధమైన సూర్యనారాయణ స్వామి ఆలయం


- ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు
- నదులు, సముద్ర తీరాల్లో పుణ్యస్నానాలు ఆచరించనున్న భక్తులు



పంచారామ క్షేత్రంలో సూర్యనారాయణమూర్తి



సూర్యభగవానుడికి ఆవు పిడకల పొయ్యిపై తయారు చేసిన ప్రసాదం (ఫైల్)



ఉప్పాడ సాగరతీరంలో సూర్యోదయం

పిఠాపురం: రథ సప్తమి వేడుకలకు సర్వం సిద్ధమైంది. శుక్రవారం రథసప్తమిని పురస్కరించుకుని పిఠాపురం నియోజకవర్గ పరిధిలో సూర్యభగవానుడికి ప్రత్యేక పూజల నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. లోకానికి ప్రత్యక్ష దైవమైన సూర్యభగవానుడికి అత్యంత ప్రీతికరమైన రోజు రథసప్తమి. ఈ రోజే లోకానికి సూర్య తేజస్సు కనిపించినట్లు శాస్త్రాలు చెబుతున్నాయి. ఉత్తరాయణ పుణ్యకాలంలో సూర్యగమణం దక్షిణ దిశ నుంచి ఉత్తర దిశకు మారడాన్ని రథసప్తమిగా చెబుతారు. రథసప్తమి రోజు మహిళలు సూర్యోదయానికి ముందే లేసి రేగుపండు, జిల్లేడి ఆకులు నుదటపై ధరించి పుణ్యస్నానాలు చేయడం ఆచారం. ఇలా చేయడం వల్ల సకల పాపాలు పోతాయని భక్తుల నమ్మకం.

సూర్యనమస్కారాలు

ముఖ్యంగా రథసప్తమి రోజున సముద్రాలు, నదుల్లో పుణ్యస్నానాలు ఆచరించి మడి బట్టలతో సూర్యభగవానుడికి నీళ్ల వదిలి సూర్యనమస్కారాలు చేయడం ఆచారంగా వస్తోంది. కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ సముద్ర తీరంలో ఏటా వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. పిఠాపురంలోని పాదగయ, కుంతీమాధవస్వామి క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

గ్రామాల్లో ప్రత్యేక పూజలు

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రథసప్తమి పర్వదినాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. మహిళలు ఆవు పేడతో ప్రత్యేక ప్రదేశంలో అలికి ముగ్గులు పెట్టి వాటిపై పొయ్యిలు (దాయలు) ఏర్పాటు చేసి వాటిపై రాగి లేదా ఇత్తడి చెంబుల్లో పాలుపోసి పాయసం తయారు చేస్తారు. ఈ పాయసం తయారు చేసే సమయంలో గరెటికి బదులు చెరకు ముక్కను వాడతారు. పొయ్యిపై ఆవు పాలు ఎంత బాగా పొంగితే అష్టైశ్వర్యాలు అంత బాగా కలుగుతాయని భక్తుల నమ్మకం. తయారైన పాయసాన్ని సూర్యభగవానుడికి నైవేద్యంగా పెట్టి పూజలు చేస్తారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఆలయాలకు వెళ్లి స్వామివార్లను దర్శనం చేసుకుంటారు.

కల్యాణోత్సవాలకు సిద్ధమైన పాండవుల మెట్ట

పెద్దాపురం: రథసప్తమి వేడుకలకు స్థానిక అమరగిరి మెట్ట (పాండవుల మెట్ట) సూర్యనారాయణ మూర్తి ఆలయం సిద్ధమౌతోంది. ఉభయ రాష్ట్రాల్లో అత్యంత ప్రసిద్ధిగాంచిన సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు వై.అనంతలక్ష్మి, గీతా వాణిల ఆధ్వర్యంలో మెట్టపై రథసప్తమి పూజలకు సూర్యనారాయణ స్వామిని, మండపాలను సిద్ధం చేశారు. 70వ మాఘమాస రథసప్తమి వేడకల్లో భాగంగా 22వ తేదీ వరకు మెట్టపై వేడుకలు నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభమయ్యే వేడుకలు సాయంత్రం శ్రీపుష్పయాగంతో పూర్తవుతాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించాలని వారు కోరారు.

భువనేశ్వరీ పీఠంలో..

స్థానిక వర్జుల వారి వీధిలోని భువనేశ్వరి పీఠంలో రథ సప్తమి వేడుకలు శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్టు లలితా వాస్తు జ్యోతిష్యాలయ నిర్వాహకుడు చింతా గోపిశర్మ సిద్ధాంతి తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సూర్య నమస్కార సహిత మహా సౌరహోమం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన కుమారా రామభీమేశ్వర ఆలయంలో రథ సప్తమిని పురస్కరించుకొని సూర్యనారాయణమూర్తి ఆలయంలో శుక్రవారం స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు ఈఓ, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. దేవస్థానం ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు, దాత సహకారంతో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని స్వామి వారి కల్యాణం తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఈఓ తెలిపారు. అలాగే స్థానిక ఐదు తూముల వద్ద వేంచేసి యున్న శ్రీఅన్నపూర్ణ సమేత రామ లింగేశ్వరస్వామి ఆలయంలో సూర్యనారాయణమూర్తి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకు లు పరమానందగిరి స్వామి చెప్పారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం



కొత్తమాయాపట్నం కాలనీలో విద్యుత్ లైన్ పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ వంగా గీత

- కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత
- కొత్త మాయాపట్నం కాలనీలో విద్యుత్ స్తంభాలకు శంకుస్థాపన

కొత్తపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. మండలంలోని ఉప్పాడ శివారు కొత్త మాయాపట్నం కాలనీలో ఎంపీ నిధులు రూ.9.50 లక్షలతో ఏర్పాటు చేయనున్న విద్యుత్ లైన్లు, స్తంభాలకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. కాలనీలోని రోడ్లు, తాగునీరు వసతులు కల్పించాలని స్థానికులు ఆమెను కోరారు. ఈ సందర్భంగా ఎంపీ గీత మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. పల్లెల్లో ప్రధాన రహదారులకు మరమ్మతులు చేస్తున్నట్టు తెలిపారు. ఉప్పాడ, కోనపాపపేటలో కోతకు గురవుతున్న తీరప్రాంతం రక్షణకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. తీరప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందన్నారు. స్థానికంగా నిర్మాణంలో ఉన్న హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీ భవనాన్ని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. దేశంలోనే 3వ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ కళాశాల భవనాన్ని కోనపాపపేట సమీపంలో సుమారు రూ.220 కోట్లతో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించిన కోర్సులు కాకినాడ జెఎన్‌టీయూలో జరుగుతాయన్నారు. ఈ కళాశాల ప్రారంభమైతే ఈ ప్రాంతానికి అంతర్జాతీయంగా గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, సైకాలజిస్ట్ వడిశెట్టి నారాయణరెడ్డి, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, విద్యుత్‌శాఖ ఈఈ ప్రభాకర్, డీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థికి అభినందనలు



విద్యార్థి చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తపల్లి: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థి మైలపల్లి చంద్రశేఖర్ రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా గురువారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థి మైలపల్లి చంద్రశేఖర్, ప్రాజెక్ట్ గైడ్ ఉపాధ్యాయుడు దాకే అప్పలరాజును ఉపాధ్యాయులు, అధికారులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సీహెచ్‌వీ రమణమూర్తి, వీవీటీ ఉమామహేశ్వరావు, ఎస్ వీర్రాజు, ఆర్‌ఎస్‌ఎస్‌పీ అరుణకుమారి, జి.మురళీ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కొట్నాలోత్సవం



వేంకటేశ్వరుని చరిత్రను భక్తులకు వివరిస్తున్న ఆగమ పండితుడు శేషాచార్యులు

- ప్రాభోదికసేవ, తిరువీధి మహోత్సవం
- పాల్గొన్న ఎంపీ గీత, ద్వారంపూడి దంపతులు

కాకినాడ: శ్రీ శ్రీనివాస దివ్య కల్యాణమహోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కొట్నాలోత్సవాన్ని (పసుపు దంచే కార్యక్రమం) శాస్త్రోక్తంగా నిర్వహించారు. శుక్రవారం స్వామి వారి కల్యాణం జరగనున్న నేపథ్యంలో సాంబమూర్తినగర్‌లోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ప్రాభోదిక సేవ అనంతరం తిరువీధి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి సతీమణి మహాలక్ష్మితో పాటు సుమారు 3 వేల మంది మహిళలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇందులో భాగంగా అర్చకులు, భక్తుల మంత్రాల మధ్య మహిళలంతా పసుపు దంచారు. వందలాదిగా తరలివచ్చిన మహిళలతో ఆనందభారతి గ్రౌండ్స్ ఆధ్యాత్మికత నెలకొంది. దంచిన పసుపుతో కల్యాణమూర్తులకు స్నపన తిరుమంజనం (మంగళస్నానం) చేయించారు. హైదరాబాద్‌కు చెందిన తాళ్లూరి నాగరాజు బృందంతో వేదనాద సంగీత నృత్య సమ్మేళనాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. కోలాటాలతో నృత్యసేవ, మార్వాడీలతో దాండియా నిర్వహించారు. ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ఆశీస్సులతో విశాఖకు చెందిన ప్రముఖ ఆగమపండితులు గోపినం బాల శేషాచార్యులు, ప్రముఖ ఆగమ పండితులు గోపినం బాల కూర్మాచార్యుల పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సతీమణి శ్రీవిద్య, ద్వారంపూడి కుమార్తెలు ప్రణీత, అంజని, కుటుంబ సభ్యులు ద్వారంపూడి మాధురి, సత్తిమానస పెద్ద సంఖ్యలో మహిళలు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ ఛైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం : పద్మావతి శ్రీనివాసుల కల్యాణోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వేడుకగా నిర్వహించేందుకు స్థానిక రంగరాయ వైద్యకళాశాల క్రీడా మైదానంలో ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 30 వేల మందికి పైగా భక్తులు వస్తారనే అంచనాతో సన్నాహాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కల్యాణమహోత్సవాన్ని జరిపించనున్నారు. తిరుమల వేంకటేశ్వరుని ఆలయ నమూనాను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు 125 అడుగుల వేదికను సిద్ధం చేసి, భక్తులు వీక్షించేందుకు వీలుగా మైదానంలో సుమారు 20 ఎల్ఈడీ స్క్రీన్‌లను అమరుస్తున్నారు. భక్తులందరికీ పంపిణీ చేసేందుకు 40 వేల శ్రీవారి తిరుమల లడ్డూలను రప్పించారు. కార్యక్రమ ఏర్పట్లను రాష్ట్ర రైసుమిల్లర్ల సంఘ అధ్యక్షుడు, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరభద్రారెడ్డి ఆధ్వర్యంలో పర్యవేక్షించారు. పార్టీ నాయకులు సుంకర విద్యాసాగర్, మల్లిపాముల గణపతి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

వరిలో తెగుళ్లపై అప్రమత్తం

ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ నరసింహారావు



గోరింటలో వరి పంటను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ నరసింహారావు

పెద్దాపురం: ప్రస్తుతం వరి సాగులో ఎదురవుతున్న తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్, శాస్త్రవేత్త సీహెచ్‌వీ నరసింహారావు అన్నారు. మండలంలోని గోరింట, జె.తిమ్మాపురం గ్రామాల్లో వరి పంటలను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 73,500 హెక్టార్లలో రబీ సాగవుతుండగా 65,472 హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారన్నారు. ఎక్కడా ఎండాకు తెగులు సోకలేదేని, కొద్ది మేర కాండం తొలుచు పురుగు ఆశించిందని, దీని నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రసుతం వరి పిలక దశలో ఉన్నందున రెండో విడత నత్రజని వేయాల్సిన రైతులు త్వరిగా వేయాలని సూచించారు. దాళ్వాలో నత్రజని ఎరువు యూరియా రూపంలో ఎకరాకు 156 కిలోలు వేయాలని, సుమారు 50 కిలోల యూరియాను రెండో విడత, ఆఖరి విడతగా మరో 50 కిలోల యూరియాను 20 కిలోల మ్యూరోఫాట్ పొటాష్‌తో కలిసి వేయాలని నరసింహారావు సూచించారు. తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



రాష్ట్ర స్థాయి ఖోఖో టోర్నమెంట్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన సునీల్, దొరబాబు

సామర్లకోట: ఈ నెల 24 నుంచి 26 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల వాల్‌పోస్టర్‌ను వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ కోఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్, అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు ఆవిష్కరించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించనున్న ఈ పోటీలపై గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయానికి వచ్చిన సునీల్‌తో పోటీల నిర్వాహక కార్యదర్శి ఉబా జాన్‌మోజెస్, అసిస్టెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కె పట్టాభిరామం వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. వైఎస్సార్ మెమోరియల్ పేరిట రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ జరుగుతున్నట్టు వారు తెలిపారు. స్త్రీ, పురుషుల విభాగాల్లో 13 ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొననున్నట్టు తెలిపారు. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో పోటీలు జరుగుతాయని చెప్పారు. పోటీలకు వివిధ జిల్లాలకు చెందిన 60 మంది న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారని తెలిపారు. విజేతలు ఉత్తరాఖాండ్‌లో మార్చి నెలలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

జిల్లా బాలల పరిరక్షణాధికారి వెంకటరావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా బాలల పరిరక్షణాధికారి వెంకటరావు

పిఠాపురం: గ్రామాల్లో ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా బాలల పరిరక్షణాధికారి సీహెచ్ వెంకటరావు హెచ్చరించారు. పిఠాపురం మండల మహిళా సమాఖ్య భవనంలో గురువారం బాల్య వివాహాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఆడపిల్లలకు 18 ఏళ్ల మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండకుండా పెళ్లిళ్లు చేయడం చట్ట రీత్యా నేరమన్నారు. వివాహాలు చేయడం వల్ల ఎక్కువగా ఆడపిల్లలకు శారీరకంగా, మానసికంగా అనేక సమస్యలు వస్తాయన్నారు. బాల్య వివాహాలను పెళ్లిచూపుల సమయంలోనూ, పెళ్లి జరిగేటప్పుడు, పెళ్లయిన రెండు సంవత్సరాల వరకూ ఎప్పుడైనా ఆపవచ్చన్నారు. బాల్య వివాహాలు చేసిన వారికి రెండేళ్లు జైలు శిక్ష పడుతుందని తెలిపారు. ఈ విషయాలపై అందరికీ అవగాహన కల్పించి బాల్య వివాహాలు జరగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పిఠాపురం ఐసీడీఎస్ సీడీపీఓ నిహారిక, పలువురు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

తంటికొండ వెంకన్నకు ప్రత్యేక పూజలు



స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

గోకవరం: మండలంలోని తంటికొండలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, చతుర్ధశ కలశారాధన, పంచామృత మండపారాధన, పూర్ణాభిషేకం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి) దంపతులు గోపూజ చేశారు. అనంతరం స్వామివారికి లక్షతులసీ పూజ, కుంకుమార్చన, మహాశాంతి హోమం, స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

నేడు రథసప్తమి వేడుకలు

తంటికొండ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక పాలు పొంగించే కార్యక్రమం, సూర్యనమస్కారాలు, సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఈఓ గండి వెంకటలక్ష్మీకుమార్ తెలిపారు.

నేటి నుంచి ఉరుసు ఉత్సవాలు

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడలో బషీర్ బీబీ (బంగారు పాప) దర్గా వద్ద శుక్రవారం నుంచి 69వ ఉరుసు ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు స్థానిక ముజావర్లు ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా ఈ ఏర్పాట్లను గురువారం స్థానిక ఎస్సై స్వామినాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బషీర్ బీబీ ఉరుసు ఉత్సవాలకు వచ్చే భక్తులు తమ పిల్లలను తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఉంచుకోవాలని సూచించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగే గంధోత్సవం ఎంతో కీలకమైందన్నారు. ఈ ఉత్సవాలకు కొత్తపల్లి, పిఠాపురం, పిఠాపురం రూరల్, గొల్లప్రోలు మండలాల్లోని 150 మందితో సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉత్సవాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. దర్గా వద్ద పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆయన వెంట పలువురు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఆలయం ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరంలో పునర్నిర్మించిన నూకాలమ్మ అమ్మవారి ఆలయం ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఈ నెల 18న రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా, లక్ష్మీచైతన్య దంపతులతో ఆలయ ప్రవేశం, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఘనంగా కొండరాజులబాబు జాతర

ఏలేశ్వరం: మండలంలోని రమణయ్యపేటలో గురువారం కొండరాజులబాబు జాతర ఘనంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాలతో పాటు ఏజెన్సీ ప్రాంతం నుంచి వందలాదిగా భక్తులు తరలి వచ్చారు. జాతరలో వేట్లపాలెం వారితో కోయ డ్యాన్స్, డప్పుల మేళం, కోనారి చువారి డ్యాన్స్, మ్యూజిక్ బ్యాండ్, లక్కగుర్రాలు, కొమ్ములాట, వెలుగుబందవారితో గరగ నృత్యం, రమణయ్యపేట యూత్ వారితో డ్యాన్స్‌బేబి డ్యాన్స్, బాణసంచా కాల్పులు ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులకు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం స్వామివారి తీర్థం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కు ప్రజ్వల్ ప్రాజెక్టు



రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైన ప్రాజెక్టుతో సలాది ప్రజ్వల్

కాకినాడ రూరల్: కాకినాడ సాలిపేట నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ సైన్స్ ప్రదర్శనలో మోహన్ హైస్కూల్ విద్యార్థిని ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైంది. పాఠశాల ఉపాధ్యాయిని ఇ.కవిత పర్యవేక్షణలో 8వ తరగతి విద్యార్థి సలాది ప్రజ్వల్ తయారు చేసిన 'సాగునీటితో పురుగు మందుల వినియోగం' అనే ప్రాజెక్టు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కరస్పాండెంట్ మోహనరావు, డైరెక్టర్ వెంకటేష్, ప్రధానోపాధ్యాయిని నాగదివ్యశ్రీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థినిని అభినందించారు.